సచ్ఛిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి :7 డిసెంబరు, 2010 సంచిక : 7

(వికృతి నామ సం॥, మార్గశిరం మాసం)

**గౌరవ సంపాదకత్వం**

శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ

**ప్రధాన సంపాదకత్వం**

శ్రీ మాతా శుకవాణి

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

శ్రీ వి.వి. కృష్ణారావుగారు

(సాయిశ్రీ ప్రింటర్స్)

**ప్రచార సారథ్యం**

శ్రీ ఎం. సత్యనారాయణగారు M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి | రూ॥ | 6/- |
| వార్షిక చందా | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి (పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

Ph : 08685-326053

9440413455, 9848133565

**విషయసూచిక** **పుటసంఖ్య**

మా వాణి .......... 2

దాసబోధ .......... 3

తనతో బాంధవ్యం .......... 6

బాలవాణి - క్షమ .......... 8

ఆశ్రమ ధర్మములు .......... 10

Be the Best .......... 12

పూలదోసిళ్లు .......... 13

స్వరాంజలి .......... 14

మంగళాక్షతలు .......... 15

లేఖావాణి .......... 16

ఆదిగురువు-దత్త ప్రభువు .......... 17

ఈనెలలో....సాయిధామంలో .......... 21

భగవతావతరణం .......... 22

కాంత-కనకం-కీర్తి .......... 26

మాతృసంస్థ కబుర్లు .......... 28







## మా వాణి



“మాసేషు మార్గశీర్షోऽహమ్” అన్నారు శ్రీకృష్ణ భగవానులు. అలాటి మాసంలో వచ్చే గొప్ప పర్వదినాలు గీతాజయంతి, దత్త జయంతి. శుద్ధ ఏకాదశి నాడు గీతామాత శ్రీకృష్ణముఖం నుండీ ఆవిర్భవించింది. పూర్ణిమనాడు శ్రీదత్తాత్రేయుల వారు జన్మించారు.

గీతలో లేని ధర్మాలు, సాధనోపాయాలు విశ్వాంతరాళంలోనే లేవని అనేకానేక విజ్ఞుల అభిప్రాయం. స్వయంగా కృష్ణుడే “అప్పుడు నా యోగశక్తులన్నీ కూడగట్టుకొని చెప్పగలిగాను గానీ యిప్పుడు మళ్లీ చెప్పమంటే నా వల్ల కాదు” అని అశ్వమేధపర్వంలో అర్జునునితో అంటాడు. అంతటి శక్తి నిధి అయిన గీత మహామహులకే అంతుబట్టలేదు. ఎవరికి వారు తమదైన కోణం నుండే చూడగలిగారు గానీ సమగ్రంగా అవగాహన చేసుకోలేకపోయారు. ఇక మన మనగా ఎంత! అందుకే -

ద్వాపరాన తాను బోధించిన గీతను స్వయంగా ఆచరించి చూపించడానికి ఈ కలియుగాన మళ్లీ వచ్చాడు పరమాత్ముడు సాయినాధ రూపంలో. తన జీవితమే భగవద్గీతగా తన ప్రవర్తన ద్వారా, బోధల ద్వారా నిరూపించిన స్వామి ఆయన. మానావమానాలు, శీతోష్ణాలు, ఆహారంలో రుచి-అరుచి ఇలాటి ద్వంద్వాలు జయించి చూపించాడు. సకల యోగుల, దేవతల స్వరూపం తానేనని ఆయా రూపాలలో కన్పించి రుజువు చేసారు. సకల జీవరాసులలో తానే ఉన్నానన్నారు. అలా తమ విశ్వరూపం ప్రదర్శించారు (అర్థం అయ్యేలా చేసారు) నానా సాహెబ్ కూతురిని కాపాడటం కోసం ఎన్నో రూపాలు ధరించారు. కమ్మరి పాపడిని కాపాడటం కోసం, నానా దాహం తీర్చడానికీ ఆయన చూపిన లీలలు మనకు తెలిసినవే. “తద్విద్ధి ప్రణిపాతేన” అన్న శ్లోకానికి వ్యాఖ్యానం చెప్తూ, ఆదిశంకరాచార్యుల వారికి కూడా అందని అర్థాలు వివరించి, ఆ శ్లోకం ద్వాపరలో తాను చెప్పినప్పటి ఉద్దేశ్యాలేమిటో స్పష్టీకరించారు.

**(మిగతా 20వ పేజీలో)**

# దాసబోధ

-ప॥పూ॥శ్రీశ్రీశ్రీ సమర్థ రామదాస స్వామివారు

## సద్గురు లక్షణాలు

సాధారణంగా మానవులు గొప్పగొప్ప మహిమలు చూపే వారిని గురువులుగా భావిస్తారు. కానీ అటువంటి గురువులెన్నటికీ మోక్షప్రదాతలు కారు-కాలేరు. సభను సమ్మోహపరిచే మంత్రములు, గారడీ విద్య, భూతవైద్యం, బహువిధాలైన అసంభవ చమత్కారాలు చూపి సంతోషం కలిగించేవారు - వీరొకరకం గురువులు. ఔషధీ ప్రయోగం, రసాయన సమ్మేళనం (పాదరస విద్య), కనికట్టుతో అడిగినవి వెంటనే తెప్పించి (సృష్టించి కాదు సుమా!) యివ్వగలవారు, ఇంకా సంగీత సాహిత్యాలు, రాగజ్ఞానం, నాట్యాదులు నేర్పువారు- వీరంతా ఒకరకం గురువులు.

పంచాక్షరీ విద్యలు, భూతవైద్యం ప్రయోగించే మంత్రాలూ మొదలైనవి నేర్పి పొట్టనింపుకొనేందుకే పనికి వచ్చే ధనం ఆర్జించుకొనే శక్తినిచ్చేవారు కూడా గురువులే. కానీ, వీళ్లెవ్వరూ సద్గురువులు కారు. నిజానికి తల్లిదండ్రులు కూడా గురువులే. కానీ, భవసాగరం నుంచీ ఉద్ధరించే సద్గురువు వేరే ఉన్నాడు. గాయత్రీ మంత్రోపదేశం చేసినవారు కూడా గురువులే. కానీ, బ్రహ్మజ్ఞానం ఉపదేశించి, అజ్ఞానాన్ని నశింపజేసి, తనకూ దైవానికీ భేదం లేదని తెలిసేలా చేసేవాడే సద్గురువు. భవభయం అనే పెద్దపులి జీవి అనే దూడను దైవమనే గోవు నుండీ వేరు చేయబోతున్నది. అప్పడు జ్ఞానఖడ్గంతో ఆ పులిని నరికి జీవుని శివునితో ఐక్యం చెయ్యగలవాడే సద్గురువు. మాయలోబడి సంసార దు:ఖతప్తులైన వారిని కాపాడేవాడు, విషయ వాసనలకు లోనై భీతి చెందిన వారిని రక్షించేవాడు, తన ఉపదేశ ప్రభావంతో శిష్యునికి ఆత్మదర్శనాన్ని అనుగ్రహించగలవాడు, అనాథల పాలిటికి రక్షకుడైనవాడు సద్గురుడు. వేదాలలోని గూఢతత్వం శిష్యుని హృదయాలలో నింపగలవాడు సద్గురుడు. సద్గురువు సందేహాలు మొదలంట నశింపజేయగలడు. స్వధర్మాన్ని





ఆదరపూర్వకంగా ప్రతిపాదన చేస్తాడు.

తన మనస్సును జయించలేనివాడు సద్గురువు కాలేడు. శిష్యులను సాధనలో ప్రవేశపెట్టక, ఇంద్రియ నిగ్రహం లేక, లోభానికి లోబడి శిష్యుల వెంట తిరిగే గురువులు పాపగ్రహాలు. జ్ఞానం కోసమే శిష్యులకు బోధ చేసేవారు, అవిద్యను మొదలంటా తొలగించేవారు, ఇంద్రియదమం సాధించేవారు మాత్రమే సద్గురువులు. కేవలం ద్రవ్యం కోసం శిష్యులను ప్రోగుచేసుకొనేవాడు, దురాశాబద్ధుడై, శిష్యుల అనుగ్రహం కోసం పాకులాడేవాడు సద్గురువు కాడు. శిష్యుల మనస్సుననుసరించి నడుస్తూ వారిని తృప్తిపరచటమే ధ్యేయంగా ప్రవర్తిస్తూ మాట్లాడేవాడు, శిష్యుల చెంత అణగిమణగి ప్రవర్తించేవాడు గురువు కాడు సరిగదా-మహాధమాధముడు, దొంగ, మోసగాడు, ద్రవ్యాశాపరుడు, పాపి. ఆశాపరుడైన వైద్యుడు రోగి మనస్సు నెరిగి ప్రవర్తిస్తూ, వాని ధనాన్ని హరించటమేగాక చివరికి వాని ప్రాణాన్ని కూడా హరించటానికి పాల్పడినట్లుగా - యిలాటి నీచుడైన గురువు శిష్యుని ధనాన్ని గ్రహించటమే గాక వాని మానవజన్మను కూడా వ్యర్థం చేస్తాడు. ఇలాటి పాపిష్ఠి గురువు - శిష్యుని గోరువంక దువ్వులు దువ్వి వాని నింకా సంసార బంధాలలో పడవేస్తాడు. ఇటువంటి పరిచయం కూడా ప్రమాదకరం.

శుద్ధ బ్రహ్మజ్ఞాని కావటంతోపాటు కర్మయోగి అయినవాడే సద్గురుడు. అతడే శిష్యునికి సరైన త్రోవ చూపగలడు. అతడే శిష్యునికి పరమార్థ దర్శనం చేయించగలవాడు. బాహ్యాడంబరం కోసం శిష్యుడి చెవిలో ఏదో మంత్రం ఊదే మిడిమిడి జ్ఞానపువాడు పాపిష్ఠి గురువు. వాడు పరమాత్మకు విరోధి. తన గురువు బోధ, శాస్త్రవాక్యం, స్వానుభవం - యీ మూడింటి ద్వారా ఒకే విషయాన్ని గ్రహించగలవాడే సద్గురువు. మోక్షాన్ని కాంక్షించేవారు ఇలాటి గురువునే వెదుక్కోవాలి. అద్వైత నిరూపణలో అద్భుతమైన ఉపన్యాసక శక్తి ఉండి కూడా విషయలోలతలో చిక్కుకొనే గురువు వలన ఎన్నటికీ శుభం కలగదు. అటువంటి గురువుకు ఆధ్యాత్మికతను గూర్చి అనుభవ జన్యమూ, నిశ్చయాత్మకమూ అయిన నిర్మలజ్ఞానం లేకపోవటం చేత - ఏ ప్రసంగం వచ్చినా ఆ ప్రసంగానికి అనుకూలంగా ఏదో కాస్తకాస్త చెప్పి తప్పకొనే వేషధారి అయిన

వంచకుడు గురువు కాడు. సామర్థ్యం, సిద్ధులు మొదలైన వాని విషయం వచ్చినపుడు మత్సరగ్రస్తుడై సాటి గురువుల విషయంలో యీసుతో మాట్లాడేవాడు గురువెలా కాగలడు? మత్సరం, లోభం విడువలేని నాడు - అటువంటి దురాశాపరుడికి భగవంతుడెలా లభిస్తాడు? అటువంటి వారు క్షుద్రులు, కాముకులు, వాగాడంబరులే తప్ప గురువులు కాలేరు.

(ఈ సందర్భంలోనే ఒక సూక్తి ఉన్నది -

"వాగ్వైఖరీ శబ్దఝరీ, శాస్త్రవ్యాఖ్యాన కౌశలమ్ ।

వైదుష్యం విదుషాం తద్వత్ భుక్తయే నతు ముక్తయే ॥"

-ప్రవాహ సదృశమైన మాట తీరు, శాస్త్ర వ్యాఖ్యానంలో అమిత నేర్పు, పండితుల పాండిత్యం - యివన్నీ పొట్ట కూటికే గానీ మోక్ష సాధనకు కాదు.)

**సద్గురువు-దాసబోధ నుండి**

ఆత్మరూపమైన ధనం అందరి దగ్గరా అక్షయంగానే ఉంటుంది. కానీ శరీరం మీద మమకారం వీడిపోని కారణంగా ఆ ధనాన్ని అందరూ గుర్తించలేకపోతున్నారు. ఈశ్వరమార్గాన్ని మర్చిపోతున్నారు. సామర్థ్యమూ, సిద్ధి ప్రాప్తమైతే చాలు. శక్తి పెరిగిపోయిందని సామాన్యులు భావిస్తున్నారు. ఈ కారణంగానే దేహబుద్ధి మరీ పెరిగిపోతున్నది. అక్షయమైన ఈశ్వరప్రాప్తి గురించి తలపెట్టక వ్యర్థమైన సామర్థ్యంకోసం పాకులాడేవాడు మూర్ఖుడు. కామ్యవాంఛకు సమానమైన దు:ఖం ఈ ప్రపంచంలో మరొకటి లేదు. సామర్థ్యం అన్నది శరీరంతోనే నశించిపోతుంది. అందుచేత నిష్కాముడూ, దృఢచిత్తుడూ అయినవాడు మాత్రమే సద్గురువు. అంత:కరణలో శుద్ధమైన బ్రహ్మజ్ఞానం ఉండి కూడా బయటకు పరమాత్ముని సామాన్య మానవునిలాగా పూజిస్తాడు సద్గురువు. ఉపాసన లేనిచోట పరమార్థం చటుక్కున జారిపోతుంది. కర్మయోగం లేనిదే సులభంగా భ్రష్టులౌతారు. జ్ఞానం, వైరాగ్యం, స్వధర్మనిర్వహణ, సాధన, శ్రవణం, మననం, నీతి, న్యాయం, మర్యాద, సేవ ఇవన్నీ కలిసి ఉన్నవాడే గురువు. ఆయన మనసులో అనేక మందిని గురించిన ఆలోచన, బాధ ఉంటాయి. పైవాటిలో ఏది లేకపోయినా అలక్ష్యం వస్తుంది.

**(మిగతా 32వ పేజీలో)**





# తనతో బాంధవ్యం

## - శ్రీశ్రీశ్రీ పరమహంస యోగానంద గారి రచనకు స్వేచ్ఛానువాదం

పరమాత్మతో మన అనుబంధం నిస్తేజమైనది కానేకాదు. మనం ఆయన బిడ్డలం. ఆయన మన విన్నపాలు వినాలి. మనం ఆయన పిల్లలమనే విషయం కాదనే అవకాశమే లేదు. అసలు ఆ మాటకు వస్తే మనను ఆయన విడిగా సృష్టించటం అంటూ లేదు. మనం ఆయనలోని భాగాలం- అంతే. మనను ఆయన యువరాజులను చేసాడు. కానీ మనం బానిసలుగా ఉండాలను కొంటున్నాం. అయినాగానీ ఆయన మళ్లీమళ్లీ మనను యువరాజులుగా మలిచి, తన సామ్రాజ్యానికి చేర్చుకోవాలని ప్రయత్నిస్తూనే ఉన్నాడు. కానీ ఒక్కడైనా తాను దివ్యాత్మ వారసుడినేనని గ్రహించలేకపోతున్నాడు. అప్రయత్నంగా లభించే ఆ వారసత్వాన్ని అందుకోలేకపోతున్నాడు. మనమందరం మర్త్యులం - అంటే మరణించి నశించిపోయేవాళ్లమేనన్న భ్రమకు లోనై బ్రతుకుతున్నాం. మనను ఆవరించిన యీ భ్రమ ముసుగును జ్ఞానఖడ్గంతో చీల్చివేసి, సత్యాన్ని గ్రహించలేకపోతున్నాం.

పరమాత్మ శక్తి అనిర్వాచ్యమనీ, మార్మికమనీ (రహస్యమయమనీ), మాయా మయమైనదనీ, మానవుల సకల చర్యలనూ సాక్షీభూతంగా చూస్తూ ఉండటమే ఆయన పని అనీ ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. కానీ, భక్తుడికి మాత్రం భగవంతుడు అత్యంత సన్నిహితుడు - చనువైనవాడు - వర్ణింపనలవి గానంత ప్రియమైనవాడూను. అంతేకాదు- స్వయంగానో, అంతర్జ్ఞానం ద్వారానో మనుషుల దు:ఖాలన్నీ తీర్చడానికి సిద్ధమయ్యేవాడూను. మనం క్రమంగా ధ్యానం చేస్తూ పోతోంటే మనలో ఒకానొక నూతన జాగృతి ప్రారంభమవుతుంది. మన లోపల ఉన్న పరమాత్మునితో సజీవమైన నూతనానుబంధం ఏర్పడుతుంది. నిన్ను ఆవరించుకొని ఉన్న నిశ్శబ్దపు పొగమంచు పొరలు, మార్మికత తెరలు అన్నీ యీ అనుబంధంతో పల్చబడతాయి. పరమాత్మ కోసం వెదకటంలో మనం చూపే గాఢత - వేకువ లోని వెలుగులాగా

పరచుకొని, ఆ మంచుపొరలన్నిటినీ కరిగింపజేస్తుంది. హఠాత్తుగా నీలాకాశం పెదవి విప్పుతుంది- "ఇడుగో చూచావా, ఆయన నా అంతటా వ్యాపించి ఉన్నాడు" అంటుంది. పూలబాలలు గుసగుసలాడుతాయి నీ చెవిలో - "ఆయన సౌరభాన్ని మాలో చూడు" అని. చుట్టూ శిలలన్నీ మౌనంగానే ప్రకటిస్తాయి- "ఆయన మాలోనే నిద్రపోతున్నాడు" అని. చెట్లు గాలి గుసగుసలతో మృదువుగా అంటాయి - "ఇడుగోనర్రా - స్వామి మాలోనే స్వప్నలోకాలలో విహరిస్తున్నాడు" అని. పక్షులు కువకువలాడతాయి - "ఆయనే మేలుకొని మాలో గీతాలు ఆలపించేది!" అని. నీ ఆత్మ నీతో అంటుంది - "ఆయనే నా గుండెల స్పందన - నీ ఆలోచనలు - ఇంతకాలం పరమాత్మను గూర్చిన స్పృహ లేని నీ ఆలోచనలు - హఠాత్తుగా ప్రకటిస్తాయి - "ఆయన నీ లోపల జాగృతినందాడు - నీ ఆంతర్యపు మృదురవళితో నిద్ర లేచాడు. అదుగో విను - నీ ఆత్మ పిలిచే పిలుపుకు బదులు పలుకుతున్నాడు. తన ప్రేమ గీతాలను నీకు మెల్లమెల్లగా వినిపిస్తూ, అంతటా కనిపిస్తున్నాడడుగో!" అని.

అందుచేత - భగవానుని నిద్రాణ ప్రతిబింబానివైన ఓయి మానవా! లే - మేలుకో. నీ జీవితంలో అత్యంత ప్రధాన కర్తవ్యం నెరవేర్చేందుకు నిశ్చితమైన ప్రయత్నం ప్రారంభించు. దైవాన్నీ, నిన్నూ, నీ ఆత్మనీ తెలుసుకో.

మాయ నిన్ను శత్రురూపంలో జయించలేకపోయినా మిత్రరూపంలో అతి సులభంగా జయించగలదు. లంకేశ్వరుడైన రావణాసురుడు తన పది శిరస్సులతోడి భీకరరూపాన్ని చూపించి సీతను మోసగించలేకపోయాడు. కానీ, సాధురూపంలో వచ్చి నిమిషంలో మోసగించగలిగాడు. అందుచేత సాధకుడైనవాడు మిత్రరూపంలో తనను చేరవచ్చే మాయను జాగ్రత్తగా కనిపెట్టి జయం పొందాలి.

– శ్రీ కేశవతీర్థ స్వామి





## బాలవాణి — క్షమ

కొన్ని వందల సంవత్సరాలకు పూర్వం ఒక మహారాజుగారుండేవారు. ఆయన గురుకులవాసం చేసే రోజులలో ఒక బ్రాహ్మణ బాలకుడు ఆయన సహపాఠి (క్లాస్‌మేట్)గా ఉండేవాడు. పెద్దవాడయ్యాక అతనొక గొప్ప పురోహితుడిగా, గురువుగా పేరు తెచ్చుకున్నాడు. రాజ్య పరిపాలనలో తనకేదైనా ధర్మసందేహం వస్తే రాజుగారు ఆయనను అడిగి తీర్చుకొంటూ ఉండేవాడు. ఇద్దరూ అప్పుడప్పుడూ కలుసుకొని బాల్యంలోని ముచ్చట్లు గుర్తు చేసుకొని సరదాగా కబుర్లు చెప్పుకొనేవారు కూడా. ఇంత సన్నిహితులైనాగానీ బ్రాహ్మణుడెన్నడూ రాజు ముందు చెయ్యి చాపి ఎరుగడు. ఆయన ఏదైనా చెయ్యబోయినా సున్నితంగా తిరస్కరించేవాడు. తన ఆశ్రమం నుండీ రాజభవనానికి కాలినడకనే వచ్చేవాడు తప్ప రథాలూ, పల్లకీలూ ఎక్కేవాడు కాడు. రాజుగారికి ఆయనంటే ఎంతో గౌరవం ఉండేది.

ఇలా ఉండగా ఓ రోజు ఆయన రాజభవనానికి వచ్చాడు. "మహారాజా, ఇవ్వేళ నేనొక పని మీద మిమ్మల్ని అర్థించడానికి వచ్చాను" అన్నాడు. "చెప్పండి మిత్రమా, సంకోచం దేనికి?" అన్నాడు రాజు చిరునవ్వుతో. "మీరు రాజద్రోహ నేరం క్రింద ఒక వ్యక్తికి మరణశిక్ష విధించారు. నేను అతని తరఫున క్షమాభిక్ష యాచించడానికి వచ్చాను" అన్నాడు బ్రాహ్మణుడు. రాజు నిర్ఘాంతపోయాడు. ఆ వ్యక్తి ఎవరో రాజుగారికి అర్థమైంది. ఇటీవలి కాలంలో రాజద్రోహానికి పాల్పడిన వాడొక్కడే! అతనికే శిక్ష పడింది. "క్షమించండి మిత్రమా! అది ధర్మ వ్యతిరేకం. పైగా అతను చేసిన ద్రోహచర్య సామాన్యమైనది కాదు" అన్నాడు రాజు. "కావచ్చు. కానీ, అతని భార్య అవిటిది, తల్లి చాలా ముసలిది. ఏ పనీ చెయ్యలేదు. పిల్లలు మరీ చిన్నవాళ్ళు. వీళ్ళంతా అతను లేక దిక్కులేని వాళ్ళవుతారు. అందుచేత అతన్ని క్షమించండి" అని మళ్ళీ అడిగాడు రాజుగారిని. "అతను ఎంతమాత్రం క్షమార్హుడు కాడు" అని రాజు గట్టిగా చెప్పి మిత్రుడి కోరిక కాదంటున్నందుకు విచారం వెలిబుచ్చాడు. "ఈ రాత్రికి మన అతిథి మందిరంలో విశ్రమించండి. ఉదయం మళ్ళీ కలుసుకుందాం" అని మిత్రుడిని సాగనంపాడు.

మరి కొంతసేపు గడిచింది. రాజదర్శనం కోసం ఒక ఆప్తమిత్రుడు వచ్చాడు. అతను చాలా నమ్మకస్తుడు. పైగా అతను ఉండేది కూడా మన బ్రాహ్మణుని

ఆశ్రమానికి దగ్గరి ఊళ్లోనే. అందుచేత రాజుగారతన్ని తన ఏకాంత మందిరంలోకి తీసుకువెళ్ళి, జరిగిన విషయం చెప్పాడు. "ఎన్నడూ ఏదీ అడగని మహానుభావుడు నోరు తెరిచి అడిగాడు. కానీ, ఆయన కోరింది చేయటం కుదరని పని. ఇది నాకు బాధగా ఉంది" అన్నాడు. వింటున్న పెద్దమనిషి చకితుడైనాడు. "ఏమిటీ! ఆ నేరస్థుడిని క్షమించమని గురువుగారు అడిగారా? విచిత్రంగా ఉందే!" అన్నాడు. "ఇద్దరూ సన్నిహితులేమో!" అన్నాడు రాజు. వచ్చినాయన తల అడ్డంగా ఊపాడు. "అబ్బే! సన్నిహితులు కారు సరికదా-వాడు ఈయనకు బద్ధశత్రువు. ఈయనేమీ అనరు. కానీ, యీయనను వాడు పెట్టిన యిబ్బందులు, తిట్టిన తిట్లు యిన్నీ అన్నీ కావు. ఓసారి పదిమంది ముందరా వాడు ఈయన ముఖాన తుపుక్కున ఊసాడు. ఇంకోసారి చంపించడాని క్కూడా ప్రయత్నించాడు. నిష్కారణంగా తన మీదికి కాలు దువ్వే అలాటి నీచుడిని రక్షించడానికి వచ్చారా ఆయన! పైగా మూడు రోజులపాటు నడిచి మరీ!" అన్నాడు అతడు.

రాజు గుండె కరిగినట్లైపోయింది. "ఎంత సహనశీలి, ఎంతటి మానవతా వాది తన బాల్యమిత్రుడు! తనకీ విషయాలన్నీ తెలిస్తే వాడినెప్పుడో చంపి పారేసే వాడు. తనకు ఇవేమీ చెప్పలేదు. తనతో ఉన్న స్నేహాన్ని ఉపయోగించుకొని శత్రువైనవాడిని శిక్షించలేదు సరిగదా-వాడి ఘోరనేరాన్ని క్షమించమని యాచిస్తున్నాడు. ఎంత కరుణామూర్తి ఆయన!" రాజు శిరస్సు తన బాల్యమిత్రుడి పట్ల గౌరవంతో వంగిపోయింది. వెంటనే మంత్రికి కబురు చేసాడు. ఆ నేరస్థుని పిలిపించమన్నాడు. వాడు వచ్చాక అతనికి క్షమాభిక్ష పెడుతున్నానని చెప్పి, దానికి కారకులైన వారెవరైనదీ అతనికి తెలియజేసి, ఆయనకు విశ్వాసపాత్రుడివై ఉండమని చెప్పి పంపాడు.

మరునాటి ఉదయం బ్రాహ్మణుడు రాజదర్శనానికి వచ్చాడు. రాజు సింహాసనం దిగి ఎదురువెళ్ళి కౌగిలించుకొన్నాడతనిని. సగౌరవంగా తీసుకువెళ్ళి, ఆసనం మీద కూర్చోబెట్టాడు. "మిత్రమా, నేనివ్వాళ గర్వపడుతున్నానయ్యా! ఎన్నడూ రాజద్రోహులను వదలని నేను నీ మహోన్నతమైన మానవత్వం ముందు తలవంచి, నీ కోరిక ప్రకారం ఆ నేరస్థుడిని విడిచిపెట్టాను. అయితే ఒక్క షరతు. నీవతన్ని దేశభక్తుడిగా తీర్చిదిద్దాలి. నీచశత్రువును కూడా ప్రేమించ గల నీలాటి మిత్రుడున్నందుకు నాకెంతో సంతోషంగా ఉందయ్యా!" అంటూ సత్కరించాడు.





# ఆశ్రమ ధర్మములు

- డా॥ జి.సాయివరప్రసాదరావు

ధర్మమనే మాటను ఈనాడు అతిగా వింటూ ఉన్నాము. ముఖ్యంగా ఎక్కడిదైనా కావచ్చు! ఎలాంటిదైనా కావచ్చు! "ధర్మం" అనే మాటను అనేకానేక ప్రసంగాలలో, ప్రవచనాలలో పెద్దలంటూ వుంటారు. ధర్మమనేది అతి విస్తారమైనది. అనంతమైనది. అన్నిటా చూడదగినది. అంతటా వ్యాపించియున్నది.

ధర్మమును ఒక సూత్రప్రాయంగా చూడటం కన్నా ఒక కొలమానంగా మల్చుకొనేకన్నా, విస్తృతము, విస్తారంగా ఎలా ఉందో? ఎక్కడ ఉందో? ఏ విధంగా ఉంటుందో? ఏ విధంగా ఉందో తీరిగ్గా, ఓపిగ్గా, గమనించుదాం.

ధర్మము అన్నది అనేక విధాలుగా విస్తరించిందని మొదటే అనుకున్నాం గదా? వర్ణ ధర్మములకన్నా, ఆశ్రమ ధర్మములు సర్వజనామోద యోగ్యములైనవి. ఆధునిక సమాజమున విశేషించి వర్ణ వ్యవస్థకు, రాజ్యాంగబద్ధమైన ప్రాధాన్యము మారిపోయినది.

ఆశ్రమములనునవి వ్యక్తి ప్రవర్తనకై నియమింపబడినవి. జీవితాంతము నియమబద్ధముగా సార్థక్యము చేసుకొనుటకు ఈ ఆశ్రమ వ్యవస్థ సహకరించినది.

విద్యార్థి దశ, గృహస్థజీవితము, విశ్రాంతి సమయము, ఆధ్యాత్మిక చింతనము అనునట్టి విభాగములకు అనుకూలమైనది ఆశ్రమ వ్యవస్థ, ఒక దశ యందు, మరియొక దశలోని ప్రవృత్తి కలిగినచో నిత్యజీవనము, వ్యాకులమగును. చదువుచున్న సమయమునందు ఇతర చింతలుండరాదు. ఇంద్రియ సుఖములకు లోనుకారాదు. ముఖ్యంగా ధనార్జనాపరుడై ఉండరాదు. అందుకు భిన్నమైనచో విద్యార్థిత్వమునకు భంగము వాటిల్లి తీరును. పూర్వ జీవితము తరువాతి జీవితమునకు మార్గదర్శకమై క్రమపరిణామమున తత్ఫలితము కానవచ్చును.

ప్రాచీన కాలమున విద్యా విషయికముగా గురుశుశ్రూషయే ప్రధానముగా గోచరించును. ధనమునకు ప్రాముఖ్యమున్నట్లు కన్పించదు. భారతము ఆది

పర్వమునందలి ఆరుణి శిష్యుడైన ఉద్దాలకుడు, ఉత్తంకుడు, ఉపమన్యువు ఉదంకుడు మొదలగు వారి చరిత్ర గురుశుశ్రూషయే శిష్యుని సేవాభాగ్యముగా గోచరించుచున్నవి.

గురువుగారు అడగకున్నను నిర్బంధముగా విసిగించి బలవంతము చేసి గురుదక్షిణ సమర్పించుటకు ఉద్యమించిన కౌత్సుని చరిత్ర కాళిదాసు రఘువంశమునందు వివరించిన ఘట్టము పైభావమును బలపర్చుచున్నది.

విద్యాభ్యాస కాలము నుండి శమదమములు అలవడుట ఇహపర సాధకము. శమమనగా మనస్సును ప్రశాంతముగా ఉంచుట. దమమనగా ఇంద్రియ నిగ్రహము. ఈ రెండును సుఖజీవనమునకేకాక శరీర ఆరోగ్యమునకు పరిపోషకములు. మనశ్శాంతి లేనపుడు సమస్త వ్యాధులు ప్రకోపించుననుట ఆధునిక వైద్యశాస్త్రము అంగీకరించియున్నది. అభ్యసించెడి విద్యలో భేదమున్నను నాటికిని, నేటికిని అనుసరించదగినవి బ్రహ్మచర్యాది ధర్మములు. స్వాధ్యాయ ప్రవచనములను వేద పురాణములకే కాక ఏ విద్యకైనను అన్వయింపజేయవచ్చును. ఏకాగ్రతతో చదివిన చదువు తపస్సు వంటిదని తైత్తిరీయములోని శిక్షాధ్యాయములో తొమ్మిదవ (9వ) అనువాకము చెప్పినది. వేదకాలము నుండి భారత కాలము వరకు ఆ ధర్మము అటులనే నడచినది. ప్రాచీన ధర్మశాస్త్రమునందలి బ్రహ్మచర్యాది ధర్మములే మహాభారతమున చెప్పబడి ఉన్నవి. నాలుగు ఆశ్రమములలో బ్రహ్మచర్యాశ్రమమే మొదటిది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులనే ముప్పురికిని వారి జీవితకాలమును ధర్మానుకూలముగా మలచుకొనుటకు నాలుగాశ్రమములు అనుమతింపబడినవను విషయమును భారతము, శాన్తిపర్వము 2 : 234లో చూడవచ్చును.

ఆనాటి వర్ణ వ్యవస్థ వృత్తుల మీద ఆధారపడి వర్ధిల్లినదే గనుక - మిగిలిన వారు నిరంతర శ్రామికులుగా ఉండవలసిన అగత్యం ఉన్నది గనుక చతురాశ్రమాలు పై మూడు వర్ణాలకే పరిమితం చేసారు. కానీ, నేటి సామాజిక వ్యవస్థలో ఆనాటి వృత్తులు మారిపోయాయి. అందుచేత ఫలానా వర్ణాలు అనే వేర్పాట్లు ఏమీ ఉండనక్కరలేదు. అందుచేత అందరికీ - మళ్ళీ మాట్లాడితే భారతీయులందరికీ యిది శిరోధార్యమే. దీనినాధారంగా గ్రహించి, బ్రహ్మచర్యము, గృహస్థ ధర్మము, వానప్రస్థము, సన్యాసములను గమనింపవలెను.

**(సశేషం)**





# Be the Best

- Doughus Malloch

If you can't be a pine
on the top of the hill
Be a scrub in the valley - but be
The best little shrub
by the side of the hill ;
Be a bush if you can't be a tree.
We can't all be captains
We have got to be crew,
There's something for all of us here
There is big work to do
And there is lesser to do.
And the task we must do is the near.
If you can't be a highway
Then just be a trail
If you can't be the sun be a star;
It isn't in size that you win or you fail -
Be the best of whatever you are.

## స్వేచ్ఛానువాదం

గిరి శిఖరాగ్రాన పెరిగే దేవదారు వృక్షానివి కాలేకుంటే
లోయలో ఎదిగే ముళ్ల తుప్పవవ్వు -
కానీ కొండచరియలలో కెల్లా చిన్నారి ముళ్ల తుప్పవవ్వు అత్యంత శ్రేష్ఠమైన
నీవు చెట్టువి కాలేకున్నా ఫర్వాలేదు - పొదగా పెరుగు.
అందరం నాయకులం కాలేము
కానీ నౌకలోని సామాన్య నావికులం కాగలం.
మనందరికీ ఏదో ఒక పని ఉంటుంది పెద్దదో - చిన్నదో.
మన చేతికి వచ్చిన పనిని మనం చక్కగా చెయ్యాలి.
నీవు రహదారివి కాకున్నా ఫర్వాలేదు,
ఓ చిన్న కాలిబాటవైనా చాలు.
నీవు సూర్యుడివి కాకున్నా ఏం కాదు - చుక్కవవ్వు
ఎంత గెలిచావు, ఎంత ఓడావు అన్నది కాదు లెక్క -
నీవు ఏది చేసినా సరే,
(అంతకన్నా గొప్పగా ఉండటం) మరి కుదరదన్నంత బాగా చెయ్యి.

# పూలదోసిళ్లు

- సాయి మామ్మగారు

- వరలక్ష్మీ వెంకటామ్మ

సాయి పాదాలకిదే - చక్కన్ని పూజ
మనసెరిగిన సాయికిదే - మనో పుష్పపూజ ॥ సా ॥

జగములనేలే సాయికిదే - జాజి పూల పూజ
పాపహరుడు సాయికిదే - పారిజాత పూజ
భక్తకోటి విభునకిదే - బంతి పూల పూజ
సిరిగల శ్రీసాయి కిదే - చేమంతుల పూజ ॥ సా ॥

కామిత ఫలదాయికిదే కమలపుష్ప పూజ
మంగళ శుభదాయికిదే మల్లెపూల పూజ
మహిమ చూపు సాయికిదే మందార పూజ
కన్నతండ్రి సాయికిదే గన్నేర్ల పూజ ॥ సా ॥

కరుణ చిలుకు సాయికిదే కనకాంబర పూజ
కలిమి నిచ్చు సాయికిదే కలువపూల పూజ
సంకీర్తన ప్రియునికిదే సంపెంగల పూజ
దీనార్తిహరునికీ దేవకాంచన పూజ ॥ సా ॥

పుణ్యరాశి సాయికిదే పున్నాగల పూజ
ద్వారకానిలయ సాయికి తులసీ దళ పూజ
చల్లన్ని తండ్రి సాయికిదే స్వర్ణ పుష్ప పూజ
బంగారు సాయికిదే బహుపుష్ప పూజ ॥ సా ॥





# స్వరాంజలి

- సుమలత

*(విజయదశమి సందర్భాన ద్వారవతిలో ఆశువైన స్తుతి)*

సాయీ దుర్గే సింహవాహిని
పాలయమాం దేవీ - పరిపాలయమాం దేవీ ॥ సా ॥
పదనత పాలిని ఫాల విలోచని
లోకనాయకి దేవి కాళికే ..... ॥ సా ॥
రాక్షస మర్దిని రమ్య కపర్దిని
దేవి కాత్యాయని పాహిమాం ..... ॥ సా ॥
ధర్మం స్థాపయ న్యాయం పాలయ
సర్వం శుభంకరి మామవదేవీ ..... ॥ సా ॥
పర్వత పుత్రీ సుమనోగాత్రీ
జ్ఞానం దేహీ జయ జగదంబికే ॥ సా ॥

☹

*(సాయిధామం వృద్ధాశ్రమంలో మతిలేని తల్లి సువర్ణ మెదడు పొరలలో దాగి ఉన్నది కొబోలు~ దసరానాడు నోట పొంగింది పాట)*

మంగళంబూ మహిమ నాథా
మంగళాకారా గోపాలా ॥ మం ॥
పేదవాడు కుచేలుని బిడ్డలను
ప్రేమమీర పోషించితి గాదా
అటుల నన్నూ పోషింపవేలా ॥ మం ॥
ద్రౌపది కృష్ణాయనగ దయను
వలువలిచ్చీ కాచితివి గాదా
అటుల నన్ననూ కావవేలా ॥ మం ॥
మొసలి నోట బడ్డ గజమూ
వినతి జేయా బ్రోచినావు -
మాయచేత బడ్డ నన్నుబ్రోవవేలా ॥ మం ॥
గొల్ల భామ లందరికి నీవు
మోక్షమీయగ లీల జూపితివీ
కాని వాడనా, కన్నతండ్రి కావవేలా ॥ మం ॥

☹

# మంగళాక్షతలు

శ్రీ సాయి విద్యాధామం తొలినాళ్లలో శ్రీ సాయి విద్యాధామంలో చదివిన పిల్ల చి॥ విజయలక్ష్మి, ఆమె తల్లి శ్రీమతి రత్న ఝాన్సీగారు ఇక్కడ పనిచేసారు కూడా. ఎం.బి.ఏ. చదివి ఉద్యోగిని అయిన చి॥సౌ॥ విజయలక్ష్మి వివాహం చి॥ గోపీకృష్ణ బి.సి.ఏ, ఎం.ఎస్సీతో అక్టోబరు 15వ తేదీ రాత్రి - అణుపురం కమ్యూనిటీ హాలులో శాస్త్రోక్త రీతిన జరిగింది. ఈ వధూవరులు పరస్పర స్నేహానురాగాలతో, నిత్యచైతన్యపరులుగా సమాజశ్రేయస్సుకై శ్రమిస్తూ, తమ సత్సంతానాన్ని లోకోపకారపరులుగా తీర్చిదిద్ది మాతృభూమి ఋణాన్ని తీర్చుకోవాలని సాయివాణి ఆకాంక్ష, గురుజనుల ఆశీస్సూను.

◆ ◆ ◆

స్వర్గీయ శ్రీ చెరుకూరి మధుసూదన్‌బాబు సాయిధామం పట్ల అభిమానం గల మంచి మిత్రుడు. ఆయన ఇల్లాలు శ్రీమతి ఝాన్సీరాణి తమ కుమార్తె చి॥సౌ॥ నాగసౌమ్య వివాహం చి॥ శ్రీరామదాసుతో అక్టోబరు 8వ తేదీ రాత్రి 7 గంటలకు - మల్లాపూర్ వి.ఎన్.ఆర్. గార్డెన్స్ ఫంక్షన్ హాలులో వైభవంగా నిర్వహించారు. చి॥ కృష్ణచైతన్య, చి॥ సాయికిరణ్‌లు తమ తండ్రిగారి సంవత్సరీకాలకు ముందరే వారికి కన్యాదాన ఫలం దక్కేలా చేసి పితృఋణంలో కొంత తీర్చుకున్న వారైనారు. చి॥ సౌమ్యా, శ్రీ రామదాసులు కలకాలం అన్యోన్యంగా జీవించి, సత్సంతానవంతులై, లోక కల్యాణకారకమైన త్రోవలో నడవాలని పరమపూజ్య గురుదేవులు ఆశీస్సులందిస్తున్నారు.

Don’t sacrifice your freedom for the sake of pomp and show.

**- లేనిపోని భేషజాల కోసం ఉన్న స్వాతంత్ర్యాన్ని నాశనం చేసుకోకు.**





# లేఖావాణి

గౌరవనీయులైన మాతాజీ గారికి, నమస్సులు.

ఈ మాసం (అక్టోబరు 2010) జీవన సౌందర్య వ్యాసం అద్భుతంగా ఉన్నది. మొత్తం మాసపత్రిక విజ్ఞానదాయకంగా మా యింటిలో అందరినీ అలరించింది. ధన్యవాదాలు. గురుదేవులకు నమస్సులతో,

- ఎం. జయప్రకాష్‌రెడ్డి, గంధంగూడా, గోలకొండ

◆ ◆ ◆

పూజ్యులు గురుదేవులకు, మాతాజీ గారికి సాష్టాంగ ప్రణామాలు.

అక్టోబరు మాసపత్రిక ‘సాయివాణి’లో ప్రతి చిన్న అంశమూ కూడా ఎంతో అత్యద్భుతంగా ఉన్నది. ముఖ్యంగా ‘జీవన సౌందర్యం’ యీ కాలంలో ఆశల వెంట అయోమయంగా పరుగులు తీసే జనానికి చక్కని కనువిప్పు కలిగిస్తుందని నా నమ్మకం. చక్కని పత్రిక అందిస్తున్న మీకు మా హృదయ పూర్వక అభినందనలు. - కె.ఎస్. కృష్ణమూర్తి, నందిగెలుగు, కృష్ణాజిల్లా

◆ ◆ ◆

*పూజ్య గురుజీ శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యసదానంద ప్రభుజీ వారికి ప్రణామములు. సాయివాణి ప్రధాన సంపాదకులు శ్రీ మాతా శుకవాణి గార్కి నమస్కారములు.*

గత 5 సం॥లుగా సాయివాణి పత్రికకు చందాదారుడను. ఈ 5 సం॥ కాలంలో పత్రిక నాణ్యత బాగా ఎదిగినది. పత్రిక ప్రచురణకు చేయూతనిచ్చిన అందరకు అభినందనలు, కృతజ్ఞతలు. ప్రతి చందాదారుడికి ఒక క్రమసంఖ్యను కేటాయించి, వారి చిరునామాపై ప్రచురించుట ప్రారంభించినప్పటి నుంచి, ముఖ్యంగా సంస్థ కార్యకలాపాల ఛాయాచిత్రములు ప్రచురించినప్పటి నుంచి లేఖ వ్రాయవలెనను సంకల్పం, అక్టోబరు 2010 సంచికలో 20వ పేజీలో ప్రచురించిన సమాచారం మేరకయినా వెంటనే వ్రాయవలెనని సంకల్పించి తిని కొంచెం ఆలస్యమయినా మా అభినందనలు తెలియ చేయించుచు న్నాము. ఈ(10/90) పత్రికలో 4వ “కవరు”పేజీలో చేసిన మార్పులు,అందు లోని “సమాచారం” వీసమెత్తు తగ్గకుండా చందాదారుని చిరునామా, తపాలా బిళ్లకు చోటు చేసిన విధానం శ్లాఘనీయం. దీని వలన కాగితము ఖర్చు, పనిలో సౌలభ్యం రెండూ తగ్గినవి. ఈ సలహా యిచ్చినవారికి అభినందనలు.

- టి.వి.ఎస్. శంకరరావు, సికింద్రాబాద్

◆ ◆ ◆

# ఆదిగురువు-దత్తప్రభువు

(గత సంచిక తరువాయి)

నా తొమ్మిదవ గురువైన అజగరం అత్యంత నిర్లిప్తంగా, నిరుద్వేగంగా ఒకే చోట పడి వుంటుంది. తన ఆహారం కోసమై అది ప్రయత్నించదు. దైవవశాత్తు తనకు అందుబాటులోకి వచ్చిన ఏ జంతువునో తిని జీవిస్తుంది. దానితోనే తృప్తి చెందుతుంది. సాధకుడు కూడా తనకు అప్రయత్నంగా సంప్రాప్తించిన దానితోనే (దైవమిచ్చిన దానితోనే) సంతృప్తి చెందాలే తప్ప, భోగవిలాసాల కోసం, ధనప్రాప్తి కోసం పరుగులు తీయరాదని నేర్చుకున్నాను.

పదవ గురువు సముద్రం. దీని లోతు అగమ్యం. దీనినిండా ఎంతెంత సంపద ఉందో తెలియదు. హద్దులు మీరి సముద్రం పొంగదు. గంభీరమైన సాగరంలాగే యోగి సంయమనంతో వర్తించాలి. అది లోతులెరుగనీయనట్లే ఇతడు తన సాధన లోతులను గూర్చిగానీ, తాను సాధించిన శక్తులనుగానీ వెలికి తోచనీయక గోప్యంగానే ఉంచాలి. సముద్రం లోపల ఏదైనా వస్తువుగానీ, జీవిగానీ పడిపోతే అది వెంటనే వాటిని బయటకు నెట్టి పారేస్తుంది తప్ప తనలో ఉంచుకోదు. అలాగే సాధకుడు కూడా తన లోపలికి ప్రవేశిస్తున్న విషయాలన్నిటినీ ఎప్పటికప్పుడు బయటకు నెట్టి పారేస్తూ ఉండాలని నేను నేర్చుకున్నాను.

నా ఏకాదశ గురువు మిడత. ఇది దీపకాంతుల చేత ఆకర్షించబడుతుంది. దాని చుట్టే తిరిగి తిరిగి చివరికి ఆ దీపజ్వాలకే తగిలి మాడిపోతుంది. తనసాటి వారెందరెందరో అలా మాడిపోవటం చూచి కూడా ఆ మిడతగారు బుద్ధి తెచ్చుకోరు. అలాగే యోగి స్త్రీలు, చక్కని దుస్తులు, మంచి మంచి వస్తువుల పట్ల ఆ కృష్ణుడైతే మాయాగ్ని జ్వాలలలో పడి దగ్ధమై నశించిపోతాడు - అని తెలిసికొన్నాను.

తేనెటీగ పువ్వు పువ్వు మీదా వాలుతుంది. పుష్పానికి ఏ మాత్రం కీడు వాటిల్లకుండా, బాధ కలక్కుండా చుక్క చుక్కగా తేనె తీసుకొంటుంది. అలాగే





యోగి గృహస్థుల నుండీ ఎంతో జాగ్రత్తగా వారికే మాత్రం కష్టం కలిగించకుండా భిక్ష స్వీకరించాలి. అది కూడా అవసరమైనంతవరకే. చిన్నపువ్వు, పెద్దపువ్వు అన్న అంతరం లేకుండా తుమ్మెద ప్రతి చోటి నుండీ కొంచెమైనా తేనె గ్రహించినట్లే యోగి ప్రతి శాస్త్రం నుండీ ఎంతో కొంత జ్ఞానాన్ని గ్రహించాలని నేను నేర్చుకొన్నాను. కనుక ఈ మధుమక్షిక నా పన్నెండవ గురువు.

వేటగాళ్లు ఏనుగులను బంధించటం కోసం ఒక మాయోపాయాన్ని పన్నుతారు. ఒక పెద్ద గొయ్యి తీసి, పైపైన చెత్తాచెదారంతో కప్పేసి, దానికి దగ్గరలో ఒక కొయ్య ఆడ ఏనుగును నిలబెడతారు. ఆ కరిణి మీది కోరికతో ఈ కరి వెళ్లి ఆ గోతిలో పడిపోతుంది. అలాగే సాధకుడైనవాడు గనుక స్త్రీ మీది లాలసను వదులుకోకపోతే - తానెంత బలశాలి అయినప్పటికీ పరుల చేతికి చిక్కిన ఏనుగులాగే- తానెంత గొప్ప జ్ఞానవంతుడైనప్పటికీ మాయ చేతికి చిక్కక తప్పదని తెలుసుకున్నాను. అందుకని ఏనుగు నాకు గురువే అయింది.

తేనెను తేనెతుట్టెల నుండీ పిండుకొనే కోయలు నాకొక పాఠం నేర్పారు. తేనెటీగలు చుక్క చుక్కగా తేనె పోగు చేస్తాయేగానీ తాము తినవు, త్రాగవు. ఎప్పటికో పనికి వస్తుందని కూడబెడతాయి. కోయలు వాటి తుట్టెల క్రింద మంటలు పెట్టి వాటిని లేవగొట్టి, తేనె కాస్తా పిండుకుపోతారు. అందుచేత ధనసంచయం అనేది దు:ఖహేతువని నాకు అర్థమైంది. పొరపాటున కూడా ఆ పూట భిక్షకు తప్ప మరో దాని కోసం ఆశపడి ప్రోగుచేస్తే- ధనం పరుల పాలూ, దు:ఖం తన పాలూ అవుతుందని గ్రహించాను. ఆ తెలివినాకు కలిగించిన కోయవాడునా పదునాల్గవ గురువు సుమా!

పదిహేనవ గురువు లేడి. లేడి ఎంతో చురుకుగా, వేగంగా పరుగెత్తగలదు. దాన్ని వెంట తరిమి పట్టుకోవటం మనిషి వలన కాదు. అందుచేత వేటగాళు లేళ్లు ఉండే వనంలో కమ్మని సంగీతం వినిపించే ఏర్పాటు చేస్తారు. లేడి ఆ సంగీత మాధుర్యానికి మైమరచి కళ్లు మూసుకొంటుంది. ఆ హాయిని అనుభవిస్తున్న సమయంలో వేటగాడు దానికి ఉరులు విసిరి బంధిస్తాడు. అలాగే సాధకుడు గనుక సంగీత, నాట్యాది కళలకు భ్రమసి, తన లక్ష్యాన్ని మరచిపోతే మాయ బోయ అతన్ని కమ్మివేసి భ్రష్టుడిని చేస్తుంది. కనుక గానాది

వినోదాలకు దూరంగా ఉండాలని నేర్చుకున్నాను.

సాధనకు అంతరాయాన్ని కల్గిస్తూ సాధకుడిని పతనం చేసేవి గుహ్యేంద్రియం (జననేంద్రియం), జిహ్వేంద్రియం. కామాన్ని జయించిన వాడు కూడా నాలుకకు లొంగిపోవటం సహజం. అన్నీ వదిలేసాను - కాస్త తిండే గదా - అనుకొని లాభం లేదు. చేప జలచరం. దానికి జిహ్వ మీద కోరిక ఎక్కువ. జాలరి గాలం చివర మాంసం ముక్కో, పిండిముద్దో, వానపామో తగిలించి నీళ్లలో వదులుతాడు. ఆ తిండి మీది కాంక్షతో చేప వచ్చి గాలానికి తగులుకొంటుంది. చచ్చిపోతుంది. అందుచేత సాధకుడు జిహ్వాచాపల్యాన్ని అణుచుకోవాలనీ, దానిమూలాన పతనం చెందే ప్రమాదం ఉన్నదనీ గ్రహించాను. కనుక చేప నా షోడశ గురువు.

అటుపైన పింగళ అనే వేశ్య దగ్గర ఒక గొప్ప విషయం నేర్చుకున్నాను. ఆమె ప్రతిరాత్రీ చక్కగా అలంకరించుకొని, పరిమళ ద్రవ్యాలు పులుముకొని, పూలు తురుముకొని, పురుషులను ఆకర్షించి, వారిచ్చిన డబ్బుతో జీవనం సాగిస్తూ ఉంటుంది. ఒకరోజు అలాగే తన ప్రియుడు వస్తాడేమోనని వేచి ఉన్నది. ఎంతకీ అతడు రాలేదు. లోనికీ, బయటికీ తిరిగింది. తన అలంకరణ మాసిపోతుందేమోనని మధ్యమధ్య అద్దంలో చూచుకుంటోంది. పక్కమీది పూలు వడిలిపోతాయేమోనని ఆరాటపడుతోంది. ఎంతకీ అతడు రాలేదు. అర్ధరాత్రి దాటిపోయింది. కొన్నిసార్లు జననాంతర పుణ్యకర్మల వలన ఆధ్యాత్మిక చింతన, వివేకం ఒక్క క్షణంలోనే కలుగుతాయి. దానితో పింగళ "ఛీ, ఛీ!" అనుకొన్నది. అతి సామాన్యుడు, ఇహలోక విషయాల పట్ల వెర్రి మోహం కలవాడూ అయిన ఒక మనిషి కోసం నేనింతగా ఆరాటపడుతున్నానే! ఆ బదులుగా నిత్యసత్య స్వరూపుడు, అసామాన్యుడు, పరమపురుషుడూ అయిన భగవంతుని మీద యీ ఏకాగ్రత నిలిపితే ఎంత బాగుండేది! కఠిన హృదయులైన మానవుల మీద కాక కరుణాళువైన భగవానుని మీద మనసు నిలిపితే ఎంత బాగుంటుంది. ఛీ! ఇకనుంచీ నేనెన్నడూ విషయ వ్యామోహాలకు లోనుకాను. జన్మనిచ్చిన స్వామే అన్నమూ పెడతాడు. నేనెందుకు బాధపడాలి?' ఇలా ఆలోచించుకొని పింగళ తన వృత్తి మానివేసి భక్తురాలిగా మారిపోయింది.





అది చూచి సాధకుడు విషయ వాసనల వెంటపడి వెంపరలాడక, మనుష్యుల స్నేహాదరాలకై తపించక, పరమాత్మపైనే దృష్టి నిలిపి ఉంచాలని నేర్చుకొన్నాను. ఆమె నా పదిహేడవ గురువు.

పదునెనిమిదవ గురువు క్రౌంచ పక్షి - అంటే లకుముకి పిట్ట వంటి ఒక రకం కొంగ. అది నోటితో ఒక మాంసం ముక్క పుచ్చుకొని ఆకాశమార్గంలో పోతున్నది. పెద్ద క్రౌంచపక్షులు కొన్ని దాని వెంటపడ్డాయి. కొంతసేపు ఆ క్రౌంచం పెద్ద వాటినుంచీ తప్పించుకోవటానికి చాలా ప్రయత్నం చేసింది. అటుపై దానికి విసుగు పుట్టింది. దానితో నోటిలోని మాంసంముక్క క్రింద పారేసింది. వెంటనే పెద్ద పక్షులన్నీ చిన్న దాన్ని విడిచిపెట్టి మాంసఖండం చుట్టూ చేరాయి. చిన్న క్రౌంచం ఓ చెట్టు మీద హాయిగా కూర్చొని, తాపత్రయపడే పక్షులను చూస్తూ ఉండిపోయింది. అది చూచాక నాకు అర్థమైంది. యోగి తనకంటూ ఏదీ మిగుల్చుకోకూడదు. సంపత్తి అనేది ఎప్పుడూ దు:ఖకారణమే. అందుచేత యోగి ఎటువంటి సంపత్తీ దాచుకోరాదని తెలిసింది.

**(సశేషం)**

## మా వాణి

**(2వ పేజీ తరువాయి)**

దైవీగుణాలు, ఆసురీగుణాలలో ప్రధానమైన వానిని ఎలా అలవరచుకోవాలో చిన్నచిన్న బోధల ద్వారా సూచించారు. ఉదాహరణకు నిందలు వెయ్యటం, పొరుగు వారి సొమ్ము దిగమ్రింగడం, గురుసంసేవనం, వ్యామోహాలు విడిచిపెట్టటం వంటి విషయాలు ఎక్కడెక్కడ చెప్పారో సచ్చరిత్ర పారాయణ చేసే ప్రతి వారికీ తెలుసు. మైత్రీ, కరుణా ఎలా పెంచుకోవాలో చెప్పారు. త్యాగశీలాన్ని పదేపదే ప్రబోధించారు సర్వజీవసమత్వం గురించి వివరించారు.

ఇంకా ఎన్నెన్నో రకాలుగా శ్రీ సాయి తన జీవితమే గీతా బోధగా చూపించారు. అందుచేత సంస్కృతంరానివారూ, గీత చదవలేనివారూ "ఆ జ్ఞానం మాకు లేకపోయెనే!" అని చింతించవలసిన పనిలేదు. బాబా చరిత్ర పారాయణ చేస్తే అంతటి శక్తీ వస్తుంది. తేలికగా అవగాహన చేసుకొనేందుకు అవకాశం ఉంది గనుక ఇబ్బందీ లేదు. అంచేత ప్రియమిత్రులారా, శ్రీ సాయి సచ్చరిత్ర అధ్యయనం చెయ్యండి. గీతార్థసారం ఆనందించండి.

# ఈ నెలలో..... సాయిధామంలో

డిసెంబరు 17 - శుక్రవారం - మార్గశిర శుద్ధ ఏకాదశి

గీతా జయంతి, ముక్కోటి ఏకాదశి

భగవద్గీతలో కర్మయోగ పారాయణ ఉదయం 7 గం॥ - 11 గం.ల వరకు

ఉదయం 9 గం.లకు గీతా పూజ

" 11-15 ని.లకు గురుదేవులచే కర్మయోగ ప్రవచనం

రాత్రి 7-00 భక్తియోగంపై ప్రవచనం

డిసెంబరు 21 - మంగళవారం మార్గశిర పూర్ణిమ

దత్త జయంతి, శ్రీ సాయినాథులు దేహం (3 రోజులపాటు) విడిచివెళ్లటం

ఉదయం 10 గం. శ్రీ దత్త వ్రతం

ఉదయం 6 గం. - 11-30 దత్త చరిత్ర పారాయణ

" 11-30 గురుదేవుల ప్రవచనం

సాయంత్రం హారతి తరువాత బాబా వారి 72 గం. సమాధి

వృత్తాంత పారాయణ

గురుదేవుల ప్రవచనం

డిసెంబరు 19 - ఆదివారం శ్రీ హనుమద్వ్రత పర్వదినం

ఉదయం 10 గం. శ్రీ సాయి హనుమంతుని పూజ

11 గం. గురుదేవుల ప్రవచనం

11-30 గం. హనుమద్భజన

12-00 గం. మహా హారతి





# భాగవతావతరణం

- శుకవాణి

పరీక్షిన్మహారాజు ఉత్తరాభిమన్యుల పుత్రుడు. ఆయన ధర్మప్రభువు. కలి పురుషుడు. మదోన్మత్తుడై పుంగవ రూపంలో ఉన్న ధర్మదేవతను గోరూపిణి అయిన భూదేవిని తన్నటం చూచి కలిని చంపటానికి ధనుర్బాణాలు చేత బూనాడు. అది చూచి ధర్మదేవుడిలా అన్నాడు. "మహారాజా, మేమెవ్వరికీ బాధకలిగించం. దైవజ్ఞులు గ్రహదేవతాదులే సుఖదు:ఖ కారణాలంటారు. యోగీశ్వరులు ఆత్మే వీటికి కారణమంటారు. మీమాంసకులు కర్మకే పెద్దపీట వేస్తారు. మన స్వభావమే దీనికి కారణమని లోకాయతికులు అంటారు. ఇవన్నీ పొరపాట్లే. దు:ఖం పరుల వలన రాదు. పరమేశ్వరుని వలననే మనకు మంచిచెడులు కలుగుతాయి. అందుచేత నీవు విచారించకు" అది విని పరీక్షిత్తు ఆయనకు నమస్కరించి , "స్వామీ, తపస్సు, శౌచం, దయ, సత్యం- యీ నాలుగూ నీ పాదాలని పెద్దలంటారు. ద్వాపరందాటగానే నీవు ఒకే పాదంతో సంచరిస్తున్నావు. ఈ కలి అది కూడా లేకుండా చేయాలను కొంటున్నాడు" అని కోపంతో కలిమీదికి కత్తి ఎత్తాడు. కలి వెంటనే నమస్కారం చేసాడు. దానితో పరీక్షిత్తు అతన్ని చంపకుండా అతను ఉండదగిన ప్రదేశాలు కొన్ని నియమించాడు. అవిప్రాణుల వధ, స్త్రీ వ్యసనం, జూదం, మద్యపానం జరిగే తావులు. ఇవి కాక ధనంకోసం, జరిగే అసత్యం, మదం, కామం, హింస, వైరం ఎక్కడుంటే అక్కడ ఉండమన్నాడు. ఇతర తావులలో కలి ప్రవేశాన్ని నిషేధించాడు. దానితో సద్ధర్మపరులంతా హాయిగా జీవించ సాగారు. (పై వాక్యాలు మరోసారి చదివి మననం చేయండి.)

ఇలా కొంతకాలం గడిచింది. ఒకనాడు పరీక్షిత్తు వేటకోసం అడవికి వెళ్లాడు. అనేకానేక జంతువులను వేటాడి, అలసిసొలసి, దాహార్తితో నీళ్ల కోసం తిరుగుతూ, ధ్యానమగ్నుడైన ఒక మునిని చూచాడు. తగని దాహంతో ఉన్నానని విన్నవించుకొని నీరుండే తావు చెప్పమని ప్రార్థించాడు. ఆ ముని

శమీక మహర్షి తన ధ్యానం తాను లీనమై ఉన్నాడు గనుక ప్రత్యుత్తరం యివ్వలేదు. ప్రభువు దాహాతురతకు అలుక తోడైంది. దప్పిగొన్న వాడికి నీళ్లివ్వడమన్న అతి సామాన్య ధర్మాన్ని కూడా యితడు పాటించలేదన్న తిక్క కోపంతో చేరువలో చచ్చిపడి ఉన్న పామునొకదాన్ని తీసి ముని భుజాల మీద వేసి వెళ్లిపోయాడు. ఈ కబురు తెలిసిన శమీక పుత్రుడు శృంగి తన తండ్రి పట్ల యీ విధమైన దుష్కృత్యం చేసినవాడు వారం రోజులు తిరక్కుండా తక్షక సర్పం చేత కరవబడి చస్తాడని శపించాడు.

శృంగి వలన జరిగిన వృత్తాంతమంతా విన్న శమీకుడు చాలా విచారించాడు. "నాయనా, నీవు చాలా పొరపాటు చేసావు. తల్లి కడుపులోనే భస్మం కాబోతూ శ్రీ కృష్ణానుగ్రహం చేత పునర్జీవితుడైనవాడు మన మహారాజు. శ్రీ కృష్ణుడు లేని యీ భువిని ధర్మబుద్ధితో పాలిస్తున్నాడితడు. ఇప్పుడీయన లేకుంటే ఈ రాజ్యం గతేమవుతుంది? ప్రభువు లేని భూమిలో బలవంతులు బలహీనుల పశువులు, సంపదలు స్త్రీలను కూడా దోచుకుంటారు. జారులు, చోరులు పెరగటం, వర్ణాశ్రమ ధర్మాలు చెదిరిపోవటం అన్యోన్యకలహాలు వ్యాపిస్తాయి. కోతులు, కుక్కలలాగా గతితప్పి ప్రవర్తిస్తారు జనులు. (నేటి పరిపాలన (మనదేశంలో) పైన చెప్పిన అరాచక ప్రభుత్వం కన్నా విశేషంగా ఉన్నదనుకోతగునా? సం॥) అందుచేత నీవు చేసినది పొరపాటు. పైగా సాధుపురుషులెప్పడు సహనశీలురై ఉండాలిగానీ యిలా ప్రతిహింసకు పాల్పడరాదు" అని బోధించి, తన పుత్రుని చాపలాన్ని మన్నించమని భగవంతుని ప్రార్థించాడు. అటుపైన తన శిష్యుని ద్వారా యీ శాపవృత్తాంతాన్ని ప్రభువుకు కబురు పంపాడు. అది విన్న మహారాజు కోపించలేదు. తన దోషాన్ని తాను వితర్కించుకున్నాడు. "గోవులు సాధువులు. విప్రులు సాధుచరితులు. వీరికీ, దైవానికీ ఎగ్గు తలపెట్టిన మహాదోషం, అది తనలో ఉన్నది. ఫలితం అనుభవించక తప్పదు" అని నిర్ణయం చేసుకున్నాడు. గంగాతీరం చేరుకొన్నాడు. "నాకు పై జన్మలో సర్వజీవులయెడా సౌజన్యంతో ఉండగల బుద్ధి లభించుగాక!" అని సంకల్పం చెప్పకొని ప్రాయోపవిష్టుడైనాడు. (అంటే ఆమరణాంతం ఆహార పానీయాదులు విసర్జించి స్థిరంగా ఉండటం.) ఆ





సమయంలో అక్కడికి వచ్చాడు శుకమహర్షి. ఆయన ఆ జన్మ ముక్తుడు. పరమధార్మికుడు.

పరీక్షిత్తు శుకుని పాదాలంటి, తను తరణోపాయం తెలుపుమని ప్రార్థించాడు. అందుకాయన "నాయనా, ద్వాపర యుగంలో మాతండ్రి వ్యాసుల వారు నాచేత భాగవత పఠనం చేయించారు. అది హరి కథాన్వితమూ, పరమ పుణ్యప్రదమూను. ఎల్లవేళలా సంసారఝంఝూటంలో మునిగి, హరి నామసంకీర్తనం ఎరుగని వారు ముక్తికి అర్హులు కారు. మనసు శూన్యం చేసుకొని, బంధవిముక్తులై ఒక్క క్షణకాలం హరినామ సంకీర్తనం చేసినా గానీ మోక్షం తథ్యం.

పూర్వ ఖట్వాంగుడనే ఒక ప్రభువుండేవాడు. ఆయన సప్తద్వీపాలకు ప్రభువు. దేవేంద్రులు రాక్షసబలాలకు ఓడిపోయి ఖట్వాంగుని సహాయం అడిగారు. ఆయన వెళ్లి యుద్ధంలో పాల్గొని రక్కసుల ఉక్కడగించాడు. అందుకుగాను ఏదైనా వరం కోరుకొమ్మన్నారు దేవతలు. "నాకేమీ అక్కరలేదు. నాకింకా ఎంత ఆయువు మిగిలి ఉన్నదో చెప్పండి. అది చాలు" అన్నాడు ఖట్వాంగుడు. 'ఇంకొక్క ముహూర్త కాలమే ఉన్నది' అన్నారు దివ్యులు. (దివ్యుల కాలమానంలో). ఆ రాజు వెనువెంటనే భూమికి గగన మార్గాన వచ్చాడు. సతీసుతులను, గృహ సంపత్తిని, సర్వం విడచి నిశ్చల చిత్తంతో హరిస్మరణ ప్రారంభించాడు. రెండు గడియలలో ముక్తిని పొందాడు.

కడపటికాలంలో "మహారాజా, నీకు ఏడు రోజుల పూర్తి సమయం ఉంది. కడపటి కాలంలో ధారణ నిలిపి, మనసు దైవాయత్తం చేసి సుస్థిరంగా ఉన్న భక్తుడు అప్రయత్నంగానే విముక్తుడు కాగలడు" అన్నాడు శుకమహర్షి.

"ధారణ ఎలా నిలుస్తుంది? అది ఎలా ఉంటుంది? అసలు ధారణంటే ఏమిటి?" ధారణ వలన బనోమాలిన్యం ఎలా నశిస్తుంది?" అని ప్రశ్నించాడు పరీక్షిత్తు.

శుకమహర్షి యిలా సమాధానం యిచ్చాడు. "ఓయి ప్రభూ, శ్రద్ధగా ఆలకించు. శ్వాసను క్రమబద్ధీకరించాలి. ఇంద్రియాల పరుగును, అహంకారాన్ని ఆపి ఉంచాలి. అటుపైన విశ్వమయుడైన హరిని చిత్తంలో

నిలుపుకొని ఉంచుకోవాలి. ఈ సమస్త సృష్టిలో ఉన్న పంచభూతాత్మకాలైన చర వస్తువులు, అచరవస్తువులూ కూడా శ్రీహరి చేతనే వ్యాప్తాలై ఉన్నాయి. అంటే విశ్వమంతా ఆయనలోనే ఒదిగి ఉన్నది. ఆ బ్రహ్మాండమైన విరాడ్రూపాన్ని ఏకాగ్రంగా మనసా చింతిస్తూ ఉండటమే కారణం. దీని వలన సంసారహేతువైన అవిద్య నశించిపోతుంది. అలాకాక హరిసాంగత్యం లేకుండానే మత్తుడై, విషయలోలుడై కాలం గడిపేవాడు నరకంలో నానా విధాలైన హింసలకు లోనవుతాడు.

భగవంతుని చెందడానికున్న మార్గాలన్నిటిలోను భక్తి మార్గమే సర్వశ్రేష్ఠం. విష్ణుకీర్తనకు నోచని తనువులు అడవిలో పెరిగే వ్రూనులవంటివి. కేవలం తిండి కోసమే సంసార సుఖంతో బ్రితకే మానవులు పశుసమానులు. ఉచ్ఛ్వాస నిశ్వాసాలే జీవించి ఉండడానికి లక్షణమైతే కొలిమితిత్తులకు కూడా ఆ లక్షణం ఉంటుంది. గాడిదలు బరువులు మోస్తాయి. సంసారులూ భారం మోస్తారు. భేదం ఏముంది? నారాయణ కథలు వినని వీనులు కొండబిలాలు. ఆయనను కాంచని కన్నులు నెమలికన్నులలాగా నిర్జీవాలు. మాధవసేవకు ఉపయోగపడని ఐశ్వర్యం అడవిగాచిన వెన్నెల. స్వామిని భజించని మనిషి గాలి నింపుకొన్న కదిలే శవాలు. అందుచేత కమలాక్షుని మదిలో నిలిపి ఉంచుకొని ముక్తిపదాన్ని అధిరోహించాలి."

ఆ బోధతో పరీక్షిత్తు మనసు స్థిరభక్తిని పొందింది. ఆయన మృత్యుభయాన్ని నిరసించి, ధర్మార్థ కామాలను సన్యసించి, పురుషోత్తముని మీదనే తన మనసు నిలిపి వినమ్రుడైనాడు. "మహర్షీ! విశ్వమంతా ఏకాకృతిగా నిలచిన పరమాత్మ ఏకారణం చేత విభిన్న రూపాలు ధరించాడు? అలా చేయకపోతే ఏమయ్యేది? నాకు వివరంగా చెప్పి ధన్యుని చేయండి" అని శుకుని మ్రోల వినీతుడై ప్రశ్నించాడు. అందుకు సమాధానంగా ఆ మహాముని భగవానుని వివిధ అవతారాలను గూర్చి, లీలలను గూర్చి మనోహరంగా వివరించాడు. అదే శ్రీమద్భాగవతం అయింది. అది శుకుని వాక్కు ద్వారా ప్రచారంలోనికి వచ్చింది. కనుక శుకవాణి అయినది. ఇదే భాగవతం అవతరించిన కథ.





# కాంత-కనకం-కీర్తి

– ప॥పూ॥ స్వామిరామ

నేనో స్వామీజీని కలవడానికి వెళ్లాను. ఆయన స్వీయానుభవ పథంలో వచ్చే ప్రలోభాలను గురించి తెలియజేయడానికి యీ కథ చెప్పారు-

ఒక యువకుడు సన్యాసాశ్రమ ప్రమాణాలు చేసి స్వామి అయ్యాడు. ఆయన గురువుగారు కాంతాకనకాలకు, కీర్తికి దూరంగా ఉండమని హెచ్చరించా రతనిని. ఒక రోజు స్వామి ఒక నదిని దాటుతూ నది ఒడ్డులో కొంత భాగం కొట్టుకుపోయిందని చూచారు. అందులోంచీ బంగారంతో నిండిన పెద్ద పెద్ద జాడీలు కొన్ని బయటకు కన్పిస్తుండటం గమనించారు (లంకెల బిందెల్లాగా). ఆయన ఈ బంగారం నాకు అనవసరం. సర్వసంగపరిత్యాగిని - నాకు దీనితో పనిలేదుగానీ...ఈ డబ్బుతో ఓ గుడి కడితే బావుంటుందను కొన్నాడు. అంచేత ఆయన కొందరు శిల్పులను, పనివారిని పిలిచి ఆ డబ్బు చూపించి దానితో దేవాలయ నిర్మాణం చేయమని కోరాడు. వాళ్లంతా తమలో తాము కూడబలుక్కొని ఆ స్వామిని నదిలో ముంచేసి, ధనం తలో కాస్త పంచుకొందామనుకొన్నారు. వాళ్ల దుండగం నుంచీ, స్వామిదైవకృపతో ఎలాగోలాగ బయటపడ్డాడు. దానితో ఆయన మరెన్నడూ డబ్బు ముట్టుకోనని నిశ్చయించుకొన్నాడు. దూరంగా ఉన్న అడవులలోకి వెళ్లిపోయి జనానికి దూరంగా ఉండసాగాడు.

కొంతకాలమయ్యాక - ఒక ఆడమనిషి ఆ అడవిలోకి వచ్చింది. మన స్వామిని చూచి నమస్కరించింది. ఎంతో వినయంతో యిలా ప్రార్థించింది- "స్వామీ, ప్రతిరోజూ మీరిలా కాయకసరులతో కాలక్షేపం చేస్తున్నారు. నేను మీకు ఆహారం యిచ్చివెడతాను రోజూ. తమనెలాగూ విసిగించను॥. స్వామి "యీమె సహృదయురాలు. జ్ఞానంకోరి నాకు పరిచర్యలు చేస్తానంటున్నది" అనుకొని సరేనన్నారు. ఒక నాడామె ఒక పిల్లిపిల్లను తెచ్చి అక్కడ వదిలింది. అది స్వామి తినే ఆహారం తినేది కాదు. పాలకోసం గోలపెట్టేది. స్వామి దాని మీద కరుణతో రోజూ కొన్ని పాలు తెచ్చిపెట్టమని ఆ స్త్రీని అడిగాడు. మరునాడామె ఒక ఆవును తోలుకొని వచ్చింది. అదేమంటే "పిల్లికీ, మీకూ

కూడా మంచి పాలు దొరుకుతాయి" అన్నది. "దీనిని ఎవరు చూస్తారు?" అని అడిగాడు స్వామి. ఆమె చాలా వినయంతో "నేను చూచుకొంటూ ఉంటాను" అన్నది. క్రమక్రమంగా ఆమె ఆవు సంగతేగాక ఆయన సంగతులు కూడా చూడసాగింది. ఇక తరువాతి కథ చెప్పేదేముంది! స్వామి సంసారి అయ్యాడు. కొంతకాలానికొక కుమారుడు కూడా కలిగాడు వారికి. ఒకనాడు మన స్వామికి పూర్వ పరిచితుడైన మరో సన్యాసి అక్కడికి వచ్చారు. ఆయన యీయన సంసారాన్ని చూచి, "ఇదేమిటి, యిలా పతనమైనావు?" అన్నాడు. అది విని స్వామి ఏడవ సాగాడు. తనకు తెలిసి తెలిసీ యిలా ప్రాపంచిక విషయాల్లో మునిగిపోయి నందుకు సిగ్గుతో, దు:ఖంతో కుమిలిపోయాడు. వెంటనే ఆ తావు విడిచి ఎక్కడికో వెళ్లిపోయాడు.

మరెన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. ఒక నాడొక వ్యక్తి ఏకాంతంలో తపస్సు చేసుకుంటున్న స్వామి దగ్గరకు వచ్చాడు. "స్వామీ, తాము గొప్ప తపస్వులు. నేను కటిక దరిద్రుడిని. నా పేదరికంపోయేలాగా నాకేదైనా సాయం చేయండి స్వామీ!" అని ప్రాధేయపడ్డాడు. అప్పటికే స్వామికి కొన్ని శక్తులు వచ్చాయిగానీ ఆయన అంతవరకెన్నడూ వాటిని ఉపయోగించలేదు. కానీ యిప్పడు స్వామీజీ ఆయనతో ఇలాగ అన్నారు, "నా-గడ్డంలోని ఒక వెంట్రుకను తీసుకొని వెళ్లు. దానిని నీ ఇంటి గూటిలో పెట్టు. రేపు ఆ గూడు ధనంతో నిండి ఉంటుంది. దీనిగురించి ఎవ్వరికీ చెప్పకు". అతను ఇంటికి తిరిగి వచ్చేక సామాన్యంగా జరిగేటట్లే తన భార్యకు ఈ విషయం చెప్పేడు. ఆవిడ ఇతరులకు చెప్పింది. త్వరలోనే ఈ విషయం బాగా ప్రచారమై వందల కొలదీ జనులు ఆయన గడ్డంలో నుండి వెంట్రుకను తెంపుకోవడానికి స్వామివారి వద్ద ప్రోగ య్యేరు. ఆయన ముఖమంతా పుండయిపోయి, రక్తం కారడం మొదలయింది.

మరొకసారి ఆయన అక్కడి నుండి వెళ్లిపోవలసి వచ్చింది. సాధన మళ్లీ మొదటి నుండి మొదలు పెట్టవలసి వచ్చింది. కాని ఆయన ఒక గుణపాఠం నేర్చుకున్నారు. ఆయనకు కాంత, కనకం, కీర్తి వీటితో వచ్చే పరిణామాలు బాగా విశదమయ్యాయి."

ఈ కథ చెప్పిన స్వామీజీ "ఈ కథ నీనెప్పడూ మరువకూడదు. ఈ కథ నీకు ఒక గుణపాఠం. యోగసాధనలో నువ్వు కలుసుకొనే ప్రతీ యువస్వామికీ ఇది చెప్పు" అని అన్నారు.





# మాతృసంస్థ కబుర్లు

అక్టోబరు నెల ప్రారంభం అంతా సాయి విద్యాధామంలో త్రైమాసిక పరీక్షల హడావుడితోను, ఎడతెగని వర్షాలతోను గడిచిపోయింది. విజయదశమి సందర్భంగా ఇళ్లు శుభ్రం చేసుకోవటాలు, ఉత్సవాలకు సంసిద్ధులు కావటాలు, మధ్యమధ్యతోటలో విత్తనాలు పెట్టడాలు, పందిళ్లు వెయ్యడాలు ఇంకా మధ్యమధ్య ఎవరూ చూడకుండా సీతాఫలం చెట్లకున్న పళ్లన్నీ లాగించడాలు, వీలైతే పచ్చివి కోసి కాల్చుకు తినడాలు వీటితో పిల్లలకు హడావుడిగా గడిచి పోయింది. అంతలో మూలానక్షత్రం రానే వచ్చింది. 13వ తేదీ ఉదయం సరస్వతీదేవి విగ్రహానికి అభిషేకం, అలంకారం జరిగాయి. బయట నుంచీ వచ్చిన పిల్లలు, ఆశ్రమం పిల్లలు కూడా శుభ్రవస్త్రాలతో అమ్మవారి ముందు బారులు తీరి కూర్చోగా పూజ ప్రారంభమైంది.

శారదాదేవి పేరే శరత్కాలపు స్వచ్ఛతను సూచిస్తుంది. ఆమె తనూ వర్ణమూ తెలుపే. ఆమె ఆసీనురాలయ్యే పద్మమూ శ్వేతారవిందమే. స్వచ్ఛమైన తెల్లని పూలతో ఆమెకు అష్టోత్తర శతనామ పూజ, పుస్తకపూజ చేసుకున్నారు పిల్లలు. తెల్లని పద్మంలో ఆమె ఉండటం వెనుక ఔచిత్యం, పంకంలో పుట్టినా తన లోపలికి ఆ కంపేమీ రానీయక పరిమళాలనూ, మరంద మాధుర్యాన్నీ పంచుతుండటం పద్మం యొక్క విశిష్టత అనే విషయం వివరించారు. కళా స్వరూపిణీ, జ్ఞాన ప్రదాయినీ అయిన సరస్వతికి నివాసస్థానం (బ్రహ్మ) నాలుక. కాబట్టి ఆ దేవి మన నాల్కలపై నటించాలంటే మన నోళ్లు స్వచ్ఛంగా -ఎలాంటి అవకతవక మాటలూ పలక్కుండా ఉండాలని విశదీకరించారు. పుస్తకం జ్ఞానప్రదాయిని గనుక దానిని జాగ్రత్తగా ఉంచుకోవాలనీ, కాలికి తగల నీయకూడదనీ హెచ్చరించారు. పూజానంతరం సరస్వతీస్తుతి, 'శారదే ఓం శారదే'వంటి పాటలు పిల్లలంతా ఏకకంఠంతో పాడారు. ప్రసాద వితరణతో పూజ ముగిసింది.

15వ తేదీ ఉదయం దుర్గాష్టమి సందర్భంగా సాయి నాథులవారు కుంకుమరంగు వస్త్రం ధరించి పూజలందుకొన్నారు. అనేకానేక వాహనాలతోపాటు ఆశ్రమ వాహనాల వాహనపూజలు నిర్వహించారు. ఆ సాయంత్రం (సత్తుపల్లి నుంచి వచ్చిన) విజయలక్ష్మి వెళ్లిపోగా 16వ తేదీ ప్రొద్దుటూరు (కడపజిల్లా) నుండీ సకుటుంబంగా వచ్చిన శ్రీ సుబ్రహ్మణ్యంగారి కుటుంబంతో ఉత్సాహంగా గడిచింది. అదే రాత్రి తెనాలి నుండీ పది మంది భక్తులు రావటంతో ఉత్సాహం పెరిగింది. 17వ తేదీ ఉదయం చి॥ గోపీకృష్ణ కుమార్తె చి॥ స్వయంప్రభకు అన్నప్రాశనం. బంతిపూల మాలలతో అలంకరింపబడిన దేవాలయంలో అష్టోత్తర శతనామపూజ అనంతరం ఆ చిట్టిపాపకు స్వామి ప్రసాదంతో అన్నప్రాశన జరిగింది. అటుపైన మహిషాసురమర్దినీ స్తోత్రం, భ్రమరాంబాష్టకం, శారదాస్తుతి, దుర్గాస్తుతి మొదలైన వాటిని భక్తులు పారాయణచేసి భజనలు చేసారు. మధ్యాహ్నం భక్తులు భోజనాలు చేసి వెళ్లిన దగ్గరి నుండీ ఎడతెరిపిలేని వర్షం పట్టుకొన్నది. సాయంత్రం శమీపూజ ఏదో అయిందనిపించవలసి వచ్చింది. ఆ వానలో పిల్లలు గుడిలోకి స్కూలు బల్లలు కొన్ని మోసుకు వచ్చారు. పెద్దపిల్లలు (తెల్లవారితే సమాధి ఉత్సవం గనుక) నిర్మాణ వ్యవస్థలో పడిపోయారు.

18వ తేదీ ఏకాదశి. ఉదయం పూజ తరువాత సమాధి అలంకరణ చేసారు. 'చూడ' కనులు చాలునా" అన్నట్లుంది అది. తెల్లని వస్త్రానికి కాషాయ వర్ణపు కుచ్చులుతోరణంగా చుట్టూ కట్టారు. అంచులపై దీపతోరణాలు వెలిగించారు. పూలమాలలు వంపులు సొంపులతో కళకళలాడాయి. లేలేత గులాబి రంగు వస్త్రాలతో అలంకృతమైన వెండి విగ్రహం సమాధి తలవైపున ఉంచారు. ఆ రోజే పుష్కరిణిలో విరిసిన రెండు చెంగలువ పూలు స్వామికి రెండువైపులా ఛత్రాల్లా అమిరాయి. దివ్వె దివ్వెనడుమా ఒక పువ్వుగా బంతిపూలు కొలువుదీరగా-అక్కడక్కడ గన్నేరుపూలు పలకరించాయి. పాదాల వైపు సాయి పాదుకలు - ఇరువైపులా దీపకాంతులతో, పుష్పాలంకరణతో ఉంచారు. పంచోపచార పూజ తరువాత శ్రీసాయి సచ్చరిత్రలోని 42, 43, 44 అధ్యాయంలోని శ్రీ సాయినాథ నిర్యాణం గురించిన విశేషాలన్నీ చదివి





మననం చేసుకున్నాము. ఆ తరువాత సాయి సమాధి నిత్యశక్తియుక్తమైనదనీ, ఆ సమాధి నుండే ఆయన సర్వకార్యాలూ నిర్వహిస్తూంటారనీ, అది మామూలు సమాధి గాక శక్తి నిధి అనీ వివరించారు పెద్దలు. అటుపైన శ్రీ సాయి సమాధిలోపల శయనించి ఉన్నారన్న భావనతో ప్రతివారూ మూడు ప్రదక్షిణలు చేసారు. మంద్రస్వరాలతో "ఓం సాయిరాం, శ్రీ సాయిరాం, జయ జయ సాయిరాం" అని నామస్మరణ చేస్తూ అలా తిరుగుతూ ఉండగా సాయినాథులవారు ఆపాద మస్తకం తెల్లని వస్త్రం కప్పకొని నిశ్చలంగా అలా పవ్వళించి ఉన్నట్లుగా ఏదో ఒక దృశ్యం కన్పించి, మనసులు తీవ్రమైన భావోద్వేగానికిలోనై కన్నీళ్లు దుమికి వచ్చాయి. అందరి ప్రదక్షిణలూ అయిపోయాక మహాహారతి ప్రారంభమైంది. పెదవులు హారతి పాటలు పలుకుతూనే ఉన్నాయిగానీ-లోలోపల "స్వామి ప్రశాంతంగా పడుకున్నారు గదా। ఇదేమీ ఆయన విశ్రాంతికి భంగం కలిగించటం లేదు గదా।" అనిపిస్తోంది. ఎప్పటికోగానీ మనస్సులు కుదుటపడలేదు. హారతి తరువాత భక్తులంతా భోజనాలు చేసి సెలవు తీసుకున్నారు. అలా సాయిధామంలో దసరా పూర్తయింది.

శ్రీ సాయినాథక్షేత్రం పరిసరాలలో దాదాపు రెండు నెలల నుండీ ఒకటే వానలు. మధ్యలో ఏ ఒకటి రెండు రోజులు తెరిపిచ్చిందో! వాతావరణంలోని యీ శీతలత్వానికి తోడు విపరీతంగా అల్లుకుపోతున్న స్వైన్‌ఫ్లూనో-మరొకటో మరొకటో అంటురోగాలు. క్షేత్రానికి ఓ ప్రక్క కృష్ణ, మరోప్రక్క కాలువ. దానితో ఆశ్రమంలో ఉన్నవారంతా ఒకేసారి పడకపెట్టేసారు. దసరాకు నాలుగైదు రోజుల ముందే కోలుకొన్నారు. ఏటా అక్కడ సమాధి ఉత్సవం మాత్రం తప్పక నడుపుతారు. నిర్వాహకుడు రామకోటేశ్వరరావు గారికి ఫ్లూ వలన కాళ్లు పట్టుకుపోయాయి. జ్వరం తగ్గినా యీ బాధ వదల్లేదు. ఆయన 18వ తేదీ ఉత్సవంకోసం ఓ వంటమనిషిని మాట్లాడాడు ముందే. తీరా ముందరి రోజు రాత్రి అతను ఫోన్ చేసి, తనకేదో అడ్డం వచ్చిందనీ గుడిపని గనుక రాలేననీ చెప్పేసాడు. చీకటిపడిపోయింది. ఊళ్లోకి వెళ్లి మరో ఏర్పాటు చేద్దామన్నా, దానికి తగినట్లు కాళ్లు నడిచేస్థితి లేదు. కోటేశ్వర్రావుకు చాలా ఆందోళన

కలిగింది. తాను పనిమాలా పిలిచిన వారందరికీ పట్టెడు ప్రసాదమన్నా పెట్టకుండా ఎలా పంపగలడు? మరెవ్వరూ ఆధారం లేని ఆయన విచారిస్తూ ఆందోళనతో పడుకొని బాబా పటం వైపు చూస్తున్నాడు. అంతలో ఏదో చిన్న వెలుగురేఖ-పొడవుగా పై నుంచీ వస్తోంది. దానిలో లేతకనకాంబరం రంగులో మెరుస్తున్న రెండు పాతకాలపు వెండి రూపాయి నాణేలు అలా గాలిలో తేలుతూ వస్తున్నాయి. ఇతను నిర్ఘాంతపోతూ చూస్తూ ఉండిపోయాడు. ఆ నాణేలు అలా అలా ఎగురుతూ వచ్చి సాయిబాబా పటంలోకి వెళ్లిపోయాయి. అప్పటిదాకా అల్లకల్లోలంగా ఉన్న కోటేశ్వర్రావు మనసు ప్రశాంతమైపోయింది. తనకు తెలియకుండానే నిద్రలోకి జారుకున్నాడు.

తెల్లవారుజామున అక్కడే పడుకొన్న నిద్రలేచారు. వాళ్లిద్దరూ అయ్యప్ప దీక్షలో ఉన్నారు. ఇళ్లలో సాధన సరిగా సాగటం లేదని ఆశ్రమానికి వచ్చి ఉంటున్నారు. కోటేశ్వర్రావు వాళ్లతోపాటే లేచి వంటవాడు రావటం లేదన్న విషయం వాళ్లకు చెప్పి "ఏం" చెయ్యాలో తోచటంలేదని వాపోయాడు. వెంటనే "దాందేముందండీ-తువ్వాలు నడుముకి కట్టుకుంటే సరి!"అన్నారు ఆ భక్తులు లుక్కా మునలయ్యా, కుమారస్వామీను. వాళ్లు కృష్ణలో స్నానం చేసి పూజాదికాలు చేసుకొనే లోపల కరెంట్ శ్రీను వచ్చాడు. అటుపైన కన్నయ్య, సామ్రాజ్యం, వాయిగాడు ఇంకా భక్తులు ఒక్కక్కళ్లే వచ్చి చేరిపోయారు. చూస్తూ చూస్తూండగానే పొయ్యిలు వెలిగాయి. ఓప్రక్క వాన. మరోప్రక్క నిరంతర వర్షాలతో పాచిపట్టిన వాకిళ్లు. అలా జారుతూనే నీళ్లుతెచ్చిపోసారు. ఆ వానలోనే సచేలస్నానంచేస్తూ వచ్చారు భాస్కరప్రసాదూ, శ్రీలక్ష్మీ చల్లపల్లి నుండీ. చూస్తూ చూస్తూండగానే సమాధి నిర్మాణం, అలంకారం పూర్తయ్యాయి. ఇటువంటలూ పూర్తయ్యాయి. వాన ఆగింది. పూజ సాగింది. బాబా సమాధికి చెందిన కథంతా చదివి హారతిచ్చేసరికి భక్తుల హృదయాలు ఆర్ద్రమయ్యాయి. ఎంతో భయపడిన రామకోటేశ్వర్రావు సుమారు నూటయాభై మందికి సంతృప్తికరంగా భోజనాలు పెట్టి 'హమ్మయ్య' అనుకొన్నాడు.

అతనికి బాబావారు గొప్పలీల చూపించారు. "శ్రద్ధ, సహనం నాలో





ఉంచు. అన్నీ నేనే నెరవేరుస్తా"నని ఋజువు చేసారు. అతను కూడా యీ లీలకు ఆశ్చర్యపోయి, మాకు ఫోన్ చేసి చెప్పాడు.

ఈ దసరా ఉత్సవాలకోసం సాయిధామంలోని వరదాయి సాయి బాబావారికీ, క్షేత్రంలోని ప్రసన్నసాయికీ, సాయి సన్నిధానంలోని సీతారామ లక్ష్మణులకూ నూతన వస్త్ర సమర్పణ చేసిన శ్రీ గుమిడెల్లి విజయకుమార్‌గారికి శ్రీ సాయి రక్ష.

అక్టోబరు 22వ తేదీ రాత్రి పూర్ణిమ సందర్భంగా శ్రీ సాయినాథ వ్రతం కన్నుల పండువుగా జరిగింది.

నవంబరు 5వ తేదీ దీపావళి అమావాస్య. ఆ కబుర్లు పైనెలలో.

---

# దాసబోధ

### (5వ పేజీ తరువాయి)

సద్గురువు సన్నిధిలో బహువిధా3లైన సాధనలకు అవకాశం ఉంటుంది. కర్మయోగ సాధన లేకుండా పరమార్థాన్ని పొందదల్చుకున్నవాడు అతి త్వరగా భ్రష్టుడవుతాడు. అందుచేత మహానుభావులైన గురువులు, కర్మయోగాన్ని, ఉపాసనని విడిచి పెట్టరు. అలా విడిచిపెట్టినవారి గురుత్వం నిష్ఫలం.

ప్రపంచంలో ఎన్నో రకాల గురువులున్నారు. ఒకడు లౌకిక విద్య నేర్పే గురువు. మంత్రాల గురువు, తాంత్రిక విద్య నేర్పే గురువు-కులగురువు-జాతిగురువు-క్షుద్రవిద్యలు నేర్పే గురువు- మరొకరు అసద్గురువు. తల్లి, తండ్రి, రాజు కూడా గురువులే? ఇలా ఎందరో, కర్మ దీక్షను ఇచ్చినవాడు (ఉపనయం) గురువే. ఆయాజాతి వృత్తులను బట్టి ఏర్పడే గురువులూ ఉంటారు. వీరు కాక స్వప్న దర్శనం ఇచ్చి ధర్మం తెలిపే గురువులు కూడా ఉంటారు. అంతేకాదు. తమకు తామే గురువులమని చాటించుకొనే గురువులకూ కరువు లేదు.

కాని సద్గురువు వీరందరి కంటే అతీతుడు. ఆయన బ్రహ్మవిద్యా సంబంధములైన సుగుణాలు, దయ కలిగిన నిరంతర పుణ్యశీలి. అట్టివారినే మనము ఎంచుకొని సేవించుకోవాలి.